నమస్తే తెలంగాణ
ఆదిలాబాద్ - నిర్మల్
5 | నిజామాబాద్ శనివారం 11 జనవరి 2025 | ADILABAD NIRMAL

పండుగ రద్దీ

ఆదిలాబాద్ బస్టాండ్‌లో ప్రయాణికుల రద్దీ

● నేటి నుంచి పాఠశాలలు, కళాశాలలకు సంక్రాంతి సెలవులు ● ప్రయాణికులతో బస్టాండ్లు కిటకిట

సంక్రాంతి సెలవులు ప్రారంభం కావడంతో ఒక రోజు ముందుగానే శుక్రవారం గ్రామాలకు, బంధువుల ఇండ్లకు విద్యార్థులు ప్రయాణమయ్యారు. జిల్లా కేంద్రంతో పాటు మండల కేంద్రాల్లోని వసతి గృహాల నుంచి విద్యార్థులను తల్లిదండ్రులు తీసుకెళ్లారు. ఆశ్రమ పాఠశాలలు, వసతి గృహాలు, కళాశాలలు విద్యార్థులు, తల్లిదండ్రులతో సందడిగా మారాయి. గ్రామాలకు వెళ్లేందుకు వచ్చిన ప్రయాణికులతో బస్టాండ్లు రద్దీగా కనిపించాయి. మంచిర్యాల, నిర్మల్, బోథ్, ఉట్నూర్, ఆసిఫాబాద్‌తో పాటు ఇతర ప్రాంతాలకు పోయే బస్సులు విద్యార్థులు, తల్లిదండ్రులతో కిటకిటలాడాయి. - ఆదిలాబాద్, (నమస్తే తెలంగాణ), జనవరి 10

నిర్మల్ బస్టాప్ వద్ద ప్రయాణికుల రద్దీ

'పది'లో వంద శాతం ఉత్తీర్ణత సాధించాలి

డీఈవో రామారావు

ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న డీఈవో రామారావు

నిర్మల్ అర్బన్, జనవరి 10 : పదో తరగతి పరీక్షల్లో 100 శాతం ఉత్తీర్ణత సాధించి నిర్మల్ జిల్లా పేరును రాష్ట్రస్థాయిలో మరోసారి నిలబెట్టాలని ఉపాధ్యాయులకు డీఈవో రామారావు సూచించారు. శుక్రవారం మంజులాపూర్‌లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. తరగతి గదులను పరిశీలించారు. రికార్డులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులందరినీ పరీక్షలకు సన్నద్ధం చేయాలని సూచించారు. వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఆదేశించారు. డీఈవో వెంట ప్రధానోపాధ్యాయురాలు సిద్ధ పద్మ, ఉపాధ్యాయులు, సిబ్బంది ఉన్నారు.

నత్తనడకన అమృత్ పనులు

నిర్మల్ మున్సిపాలిటీలో ముందుకు సాగని తాగునీటి పథకం

నిర్మల్‌లోని గాంధీపార్కులో గత కేసీఆర్ ప్రభుత్వం నిర్మించిన ఓహెచ్ఎస్ఆర్

● సమన్వయ లోపంతో నిలిచిన పనులు

● మూలుగుతున్న రూ.62 కోట్ల కేంద్రం నిధులు

నిర్మల్, జనవరి 10 (నమస్తే తెలంగాణ): తాగునీటి సమస్య పరిష్కారానికి నిర్మల్ జిల్లాలో చేపట్టిన అమృత్ పథకం పనులు నత్తనడకన సాగుతున్నాయని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. తాగునీటి సమస్య శాశ్వత పరిష్కారానికి కేంద్ర ప్రభుత్వం అమృత్ పథకం కింద నిధులు మంజూరు చేసిం ది. ఇందులో భాగంగా జిల్లాలో నిర్మల్ మున్సిపాలిటీకి రూ.62 కోట్లు, ఖానాపూర్ మున్సిపాలిటీకి రూ.22 కోట్లు కేటాయించారు. తాగునీటి పథకాలకు టెండర్ల ప్రక్రియ పూర్తయి ఏడాదైనా పనులకు మాత్రం మోక్షం లభించడం లేదు. ఖానాపూర్‌లో పనులు ప్రారంభమైనప్పటికీ నత్తనడకన సాగుతున్నాయన్న విమర్శలు ఉన్నాయి. ఖానాపూర్‌లోని గాంధీనగర్ వద్ద రిజర్వాయర్ నిర్మాణంతో పాటు, అన్ని కాలనీలకు తాగునీరందేలా కొత్తగా పైప్‌లైన్ నిర్మాణ పనులు చేపట్టాల్సి ఉండగా, ఇటీవలే జేకే నగర్ కాలనీలో మాత్రమే ప్రారంభించారు. నిర్మల్ మున్సిపాలిటీలో టెండరు ప్రక్రియ పూర్తయినా ఇప్పటికీ ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదు. కేవలం అక్కడక్కడ పైపులను మాత్రం వేశారు. ఈ పథకం కింద ఎస్సారెస్పీ సమీపంలోని గాంధీనగర్ పంప్ హౌస్ నుంచి నిర్మల్ పట్టణ శివారులోని సిద్ధాపూర్ ఫిల్టర్ బెడ్స్ వరకు, పట్టణంలోని పలు పాత రిజర్వాయర్లకు మంచి నీటిని తరలించేలా కొత్తగా పైప్‌లైన్లను వేయాల్సి ఉన్నది. జిల్లా కేంద్రంలో 20 ఏళ్ల క్రితం వేసిన పాత పైప్‌లైన్ చెడిపోవడంతో తరచూ లీకేజీలు ఏర్పడుతున్నాయి. దీంతో ఈ పైప్‌లైన్‌కు సమాంతరంగా దాదాపు 15 కిలోమీటర్ల మేర కొత్తగా పైప్‌లైన్ వేసి పట్టణంలోని ఇసురాళ్ల గుట్ట వద్దగల సంప్ వరకు లింక్ చేయాల్సి ఉంది. పాలిటెక్నిక్ కళాశాల సమీపంలో, సోఫీనగర్, ఆదర్శనగర్ కాలనీల్లో మూడు చోట్ల కొత్తగా ఈఎల్ఎస్ఆర్ (ఓవర్ హెడ్ రిజర్వాయర్)ను నిర్మించాలి. ఇందుకోసం రూ.62 కోట్లను కేటాయించారు. అధికారులు, కాంట్రాక్టర్ల మధ్య సమన్వయం లేక పనులు ముందుకు సాగడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇందుకు రాజకీయ ఒత్తిళ్లు కూడా ఒక కారణంగా చెబుతున్నారు. కేంద్ర ప్రభుత్వ నిధులతో చేపడుతున్న ఈ పనులను ప్రారంభించేందుకు స్థానిక ఎమ్మెల్యే సమయం ఇవ్వకపోవడంతోనే పనులు మొదలు కావడం లేదని తెలుస్తున్నది.

వచ్చే వేసవి నాటికి నీరందేనా...?

నిర్మల్ పట్టణం జిల్లా కేంద్రంగా మారిన నాటి నుంచి పట్టణం రోజురోజుకూ విస్తరిస్తున్నది. విద్య, వైద్యం, ఇతర ఉపాధి అవకాశాల కోసం చుట్టు పక్కల ప్రాంతాల నుంచి అనేక మంది పట్టణానికి వచ్చి స్థిర నివాసం ఏర్పాటు చేసుకుంటున్నారు. దీంతో కొత్త కాలనీలు ఏర్పాటవుతున్నాయి. ప్రస్తుతం కొనసాగుతున్న తాగునీటి పథకంతో పాత కాలనీలకే మున్సిపాలిటీ ద్వారా తాగునీటిని అందించే అవకాశం ఉన్నది. గత కేసీఆర్ ప్రభుత్వంలో మిషన్ భగీరథ పథకం కింద కొన్ని కాలనీలకు కొత్తగా పైప్‌లైన్‌లను వేయడంతో పాటు కొత్తగా ఓహెచ్ఎస్ఆర్ ట్యాంకులను నిర్మించారు. కొత్తగా అమృత్-2 కింద ప్రతిపాదించిన రిజర్వాయర్లతో మరిన్ని కొత్త కాలనీలకు తాగునీరందే అవకాశం ఉన్నది. టెండర్లు దక్కించుకున్న సంస్థ ఇప్పటి వరకు పనులను మొదలు పెట్టలేదు. వేసవి నాటికి పనులు పూర్తవుతాయా..? లేదా అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ప్రస్తుతం ఉన్న తాగునీటి వ్యవస్థతో ప్రతి సంవత్సరం వేసవిలో రోజు విడిచి రోజు నీటిని అందించే పరిస్థితి ఉన్నది. అధికారుల నిర్లక్ష్యం, రాజకీయ నాయకుల ఒత్తిళ్లతో అమృత్-2 పనులు సకాలంలో పూర్తయ్యే పరిస్థితి కనిపించడం లేదు. ఇప్పటికైనా స్థానిక ప్రజా ప్రతినిధులు, అధికారులు పట్టించుకొని పనులు జరిగేలా చూడాలని ప్రజలు కోరుతున్నారు. ఈ విషయమై ప్రజారోగ్య శాఖ ఏఈ శ్రీనివాస్‌ను వివరణ కోరగా, త్వరలోనే స్థానిక ఎమ్మెల్యే సమయం ఇస్తామన్నారని, ఇవ్వగానే పనులను ప్రారంభిస్తామని తెలిపారు.

అమృత్-2 పథకం కింద పైప్‌లైన్లు వేసేందుకు సిద్ధంగా ఉంచిన పైపులు

సంక్షేమ పథకాలపై సమీక్ష

ఎదులాపురం, జనవరి 10 : హైదరాబాద్‌లోని సచివాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన కలెక్టర్ల సమావేశంలో ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షి షా పాల్గొన్నారు. రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రేషన్ కార్డులు ఇందిరమ్మ ఇండ్ల పథకాల అమలు, లబ్ధిదారుల జాబితాల తయారీపై రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధ్యక్షతన సమీక్షా సమావేశం జరిగింది. ప్రభుత్వ పథకాలను పకడ్బందీగా అమలు చేయాలని నిర్ణయం తీసుకున్నారు.

సమావేశంలో పాల్గొన్న ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షి షా

పత్తి ధరలో మళ్లీ కోత

● నాణ్యత సాకుతో పది రోజుల్లో రూ.100 తగ్గించిన సీసీఐ ● పత్తి రైతుల ఆగ్రహం

ఆదిలాబాద్, జనవరి 10 (నమస్తే తెలంగాణ) : పత్తి రైతులను ఆదుకోవాల్సిన కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) నాణ్యత పేరిట నష్టాలకు గురిచేస్తున్నదని విమర్శలు వస్తున్నాయి. కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర కంటే పంట నాణ్యత పేరిట తక్కువకు కొనుగోలు చేస్తూ రైతులను నట్టేట ముంచుతున్నది. ఆదిలాబాద్ జిల్లాలో 90 శాతం మంది రైతులు పత్తి పంటను సాగుచేస్తూ ఉపాధి పొందుతారు. అహర్నిశలు కష్టపడి సాగు చేసిన పంటకు మద్దతు ధర కల్పించాల్సిన కేంద్ర ప్రభుత్వం రంగ సంస్థ సీసీఐ పక్కా వ్యాపార సంస్థగా కొనసాగుతూ పత్తి పంట కొనుగోళ్ల విషయంలో ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నదని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ఆదిలాబాద్ మార్కెట్‌యార్డులో పత్తి కొనుగోళ్లు

పది రోజుల్లో రూ. 100 కోత..

జిల్లాలో వానకాలంలో 3.85 లక్షల ఎకరాల్లో రైతులు పత్తి పంటను సాగు చేశారు. 40 లక్షల క్వింటాళ్ల పంట విక్రయానికి వస్తుందని అంచనా వేసిన అధికారులు సీసీఐ ఆధ్వర్యంలో పంట కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారు. రెండున్నర నెలలుగా కొనుగోళ్లు చేపడుతున్నారు. పత్తికి కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర క్వింటాల్‌కు 8 శాతం తేమతో రూ.7521 కొనుగోళ్లు ప్రారంభించారు. పది రోజుల క్రితం వరకు ధరతోనే కొనుగోలు చేశారు. దూది పింజ పొడవు సరిగా రావడం లేదంటూ జనవరి 2 నుంచి క్వింటాల్‌కు రూ.50 తగ్గించి కొనుగోలు చేశారు. క్వింటాకు రూ.50 నష్టపోతున్నామని రైతులు ఆందోళన చెందుతుండగా ఇప్పుడు మరో రూ.50 తగ్గిస్తున్నట్లు మార్కెటింగ్ శాఖ అధికారులు ప్రకటన విడుదల చేశారు. ఈ నెల 16 నుంచి క్వింటాకు రూ.100 తగ్గించి రూ. 7421తో కొనుగోలు చేయనున్నట్లు తెలిపారు. జిల్లాలో ఇప్పటికే 60 శాతం పంట విక్రయాలు జరుగగా ఇంకా రైతుల వద్ద పంట ఉంది. సీసీఐ నాణ్యత పేరిట రైతులకు అన్యాయం చేస్తుందని రైతుల సంఘాల నాయకులు ఆరోపిస్తున్నారు. సీసీఐ పత్తి ధరను తగ్గించకుండా మద్దతు ధరతో కొనుగోలు చేయాలని కోరుతున్నారు.

దోపిడీకి పాల్పడుతున్న సీసీఐ

జిల్లాలో రైతులు ప్రకృతి వైపరీత్యాలు, చీడ పురుగులు, తెగుళ్ల బెడదను తట్టుకుని ఎన్నో ఇబ్బందులతో పత్తి పంటను సాగు చేస్తారు. పెట్టుబడులు సైతం ప్రతి యేటా పెరుగుతూనే ఉన్నాయి. రైతులకు అండగా ఉండాల్సిన కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ సీసీఐ కార్పొరేట్ సంస్థగా వ్యవహరిస్తూ రైతుల నిట్ట నిలువునా దోచుకుంటుంది. జిల్లాలో పత్తి సాగుకు అనుకూలమైన నేలలు, వాతావరణం, రైతులకు అనుభవం ఉంది. పత్తి పంట నాణ్యత విషయంలో ఎలాంటి మార్పులేకపోయినా సీసీఐ ధరను తగ్గిస్తుంది. జిల్లా అధికారులు స్పందించి ధర తగ్గించకుండా రైతులను ఆదుకోవాలి.

- సంగెం బొర్రన్న, రైతు స్వరాజ్య వేదిక, ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షుడు

పాఠశాలల అభివృద్ధికి కృషి

బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్

అదనపు తరగతి గదుల నిర్మాణ పనులు ప్రారంభిస్తున్న బోథ్ ఎమ్మెల్యే అనిల్‌జాదవ్, ఎంపీ గొడం నగేశ్

బోథ్/ఇచ్చోడ(బజార్‌హత్నూర్)/తాంసి/తలమడుగు, జనవరి 10 : బోథ్ నియోజకవర్గంలో ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి కృషి చేస్తానని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. శుక్రవారం బోథ్ మండలంలోని పట్నాపూర్ ఆశ్రమోన్నత పాఠశాలలో రూ.30 లక్షల నిధులతో నిర్మించనున్న అదనపు తరగతుల భవనాల నిర్మాణానికి ఆదిలాబాద్ ఎంపీ గొడం నగేశ్‌తో కలిసి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధికి తమవంతు కృషి చేస్తామన్నారు. విద్యార్థులు ఉన్నత చదువులు చదివి పాఠశాలకు గుర్తింపు తీసుకురావాలన్నారు. పదో తరగతి పరీక్షలకు విద్యార్థులను సన్నద్ధం చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఈ సందర్భంగా ఎంపీ, ఎమ్మెల్యేలను ఉపాధ్యాయులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ తుల శ్రీనివాస్, మాజీ జడ్పీటీసీ ఆర్.సంధ్యారాణి, బీఆర్ఎస్ కన్వీనర్ డీ నారాయణ రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ ప్రశాంత్, జుగాది రావ్, సుగుణ, శంకర్, సురేందర్ యాదవ్, ప్రశాంత్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. బజార్‌హత్నూర్ మండలంలోని మడగూడ గ్రామంలోని ప్రభుత్వ ఆశ్రమ పాఠశాలలో రూ.30 లక్షలతో అదనపు తరగతుల నిర్మాణానికి ఎంపీ, ఎమ్మెల్యేలు భూమి పూజ చేశారు. వారిని ఉపాధ్యాయులు సత్కరించారు. అనంతరం తరగతి గదుల్లో ఎమ్మెల్యే తిరుగుతూ విద్యార్థినులతో ముచ్చటించారు. వారి వెంట నాయకులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. తాంసి మండలంలోని లీంగూడ గ్రామంలో రూ.60 లక్షలతో మల్టీ పర్పస్ సెంటర్ నిర్మాణానికి భూమి పూజ చేసి పనులను ఎంపీ, ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ తాటిపల్లి రాజు, బీఆర్ఎస్ పార్టీ మండల మాజీ కన్వీనర్ కృష్ణ రత్న ప్రకాశ్, మాజీ సర్పంచ్ సదానందం, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. తలమడుగు మండలంలోని భరంపూర్‌లోని నర్సాపూర్, కొలాం గూడ, సోనాపూర్ గ్రామాల్లో రూ.60 లక్షల వ్యయంతో చేపట్టే మల్టీ పర్పస్ సెంటర్ల పనులను ఎంపీ, ఎమ్మెల్యేలు ప్రారంభించారు. అనంతరం నర్సాపూర్‌కు చెందిన శంకర్ ట్రైకార్ రూ.2 లక్షలతో ఏర్పాటు చేసుకున్న కిరాణా షాప్‌ను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో నాయకులు తుల శ్రీనివాస్, ముడుపు కేదారేశ్వర్ రెడ్డి, తోట వెంకటేశ్, రంజిత్ రెడ్డి, రమాకాంత్, అభిరామ్ రెడ్డి, కనపర్తి చంద్రకాంత్, అధికారులు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

మైనర్లను పనిలో పెట్టుకుంటే కేసులు

వైకుంఠపూర్‌లో సీసీ కెమెరాలను ప్రారంభిస్తున్న ఏఎస్పీ రాజేశ్‌మీనా

సారంగాపూర్, జనవరి 10 : మైనర్లను పనిలో పెట్టుకుంటే కేసులు నమోదు చేస్తామని నిర్మల్ జిల్లా ఏఎస్పీ రాజేశ్‌మీనా హెచ్చరించారు. ఆపరేషన్ స్మైల్-11లో భాగంగా శుక్రవారం సారంగాపూర్ మండల కేంద్రంలోని వివిధ హోటళ్లలో పని చేస్తున్న బాలుడు, బాలికను పట్టుకొని వారి తల్లిదండ్రులను పిలిపించి కౌన్సెలింగ్ నిర్వహించారు. అనంతరం బాలలను తల్లిందండ్రులకు అప్పగించారు. బాలలను పనిలో పెట్టుకున్న యజమానులు భూమాగౌడ్, బూర రాముపై కేసులు నమోదు చేశారు. ఈ సందర్భంగా ఏఎస్పీ మాట్లాడుతూ హోటళ్లు కిరాణాదుకాణాలు, ఇటుక బట్టీలు, ఇతర పనుల్లో మైనర్లను పెట్టుకుంటే యజమానులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అంతకుముందు పోలీస్‌స్టేషన్‌ను ఏఎస్పీ తనిఖీ చేశారు. స్టేషన్ రికార్డులు, సిబ్బంది పనితీరు రికార్డులను పరిశీలించారు. కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. పోలీసుల గౌరవ వందనాన్ని స్వీకరించారు. అనంతరం వైకుంఠపూర్‌లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను ప్రారంభించారు. ఒక్క సీసీ కెమెరా 100 మంది పోలీసులతో సమానమని తెలిపారు. గ్రామాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకుంటే దొంగతనాలు, దోపిడీ వంటి ఘటనలు జరిగినప్పుడు దొంగలను త్వరగా పట్టుకోవచ్చాన్నారు. ప్రతి గ్రామంలో ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమాల్లో ఏఎస్పీ వెంట సీఐ రామకృష్ణ, ఎస్ఐ శ్రీకాంత్, ఆపరేషన్‌స్మైల్ ఇన్‌చార్జి ఎస్ఐ సాధిక్, చైల్డ్‌లేబర్ డిపార్ట్‌మెంట్ అధికారి మహేశ్, బాలల పరిరక్షణ అధికారులు నరేందర్, సగ్గంరాజు, హెడ్‌కానిస్టేబుల్ అబ్దుల్‌జమీర్, కానిస్టేబుళ్లు నరేశ్, ముత్యం పాల్గొన్నారు.

కాంగ్రెస్ ఇచ్చిన హామీలు నెరవేర్చాలి

ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ క్యాంప్ కార్యాలయం ఎదుట ఆశ కార్యకర్తల ధర్నా

ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ క్యాంప్ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న ఆశ కార్యకర్తలు

ఉట్నూర్, జనవరి10 : ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ తన మెనిఫెస్టోలో పొందుపర్చిన హామీలు వెంటనే అమలు చేయాలని ఆశ వర్కర్స్ యూనియన్ ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షురాలు నైతం శోభ డిమాండ్ చేశారు. శుక్రవారం ఉట్నూర్‌లోని కాంగ్రెస్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ క్యాంప్ కార్యాలయం ఎదుట ఆశ కార్యకర్తలు నిరసన తెలిపారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీల ప్రకారం ఆశ కార్యకర్తలకు రూ.18వేల వేతనం ఇవ్వాలని, రూ.50 లక్షల బీమా సౌకర్యం, రిటైర్మెంట్ బెనిఫిట్స్ కల్పించాలని, 20 రోజుల వేతనంతో కూడిన క్యాజువల్ సెలవులు ఇవ్వాలన్నారు.

ఎమ్మెల్యే ఇంటి ఎదుట ఆశ కార్యకర్తల ధర్నా

నిర్మల్‌లో ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి ఇంటి ఎదుట ధర్నా చేస్తున్న ఆశ కార్యకర్తలు

నిర్మల్ చైన్‌గేట్, జనవరి 10: సమస్యలు పరిష్కరించాలని కోరుతూ నిర్మల్‌లో ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి ఇంటి ఎదుట ఆశ కార్యకర్తలు ధర్నా చేశారు. అనంతరం ఎమ్మెల్యే పీఏకు వినతిపత్రం అందించారు. ఈ నిరసనలో నిర్మల్ జిల్లా యూనియన్ అధ్యక్షురాలు సుజాత, ఉపాధ్యక్షురాలు చంద్రకళ, తదితరులు ఉన్నారు.

బైంసాలో..

బైంసా, జనవరి, 10 : పట్టణంలోని ఎస్ఎస్ జిన్నింగ్ ఫ్యాక్టరీలో ఎమ్మెల్యే రామారావు పటేల్‌ను కలిసి సమస్యలు పరిష్కరించాలని ఆశ కార్యకర్తలు వినతి పత్రం అందించారు.

ఆశ కార్యకర్తలకు అండగా ఉంటాం

-బోథ్ ఎమ్మెల్యే అనిల్‌జాదవ్

గుడిహత్నూర్, జనవరి 10 : ఆశ కార్యకర్తలకు న్యాయం జరిగే వరకు బీఆర్ఎస్ అండగా ఉంటుందని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. గుడిహత్నూర్‌లో ఎమ్మెల్యేకు శుక్రవారం ఆశ కార్యకర్తలు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం కోసం ఆశ కార్యకర్తలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో నిర్లక్ష్య ధోరణి అవలంబిస్తున్నదని ఆరోపించారు. అసెంబ్లీ సమావేశాల్లో ఆశ కార్యకర్తల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని భరోసానిచ్చారు.